కుంగిన కరకట్ట ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

కరకట్టను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఏటూరునాగారం, జనవరి 29 : మండలంలోని రామన్నగూడెం గోదావరి కరకట్టను అదనపు కలెక్టర్ శ్రీజ సోమవారం పరిశీలించారు. రామన్నగూడెం సమీపంలోని గోదావరి కరకట్ట వరద ఉధృతికి దెబ్బ తినడంతో ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రస్తుత పరిస్థితి నీటిపారుదల శాఖ ఈఈ జగదీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. కరకట్ట నిర్మాణానికి గతంలోనే ప్రభుత్వం రూ.130 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.. గత ఏడాది వచ్చిన వరద వివరాలను అడిషనల్ కలెక్టర్ అధికారుల నుంచి సేకరించారు. రామన్నగూడెంలోని ఎస్సీ కాలనీ వరద ముంపునకు గురి కావడంతో ఆ ప్రాంతాన్ని కూడా సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ సక్రమంగా లేదని సర్పంచ్ దొడ్ల కృష్ణ అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మండలకేంద్రంలోని లైబ్రరీని సందర్శించారు. ఆమె వెంట సీఈవో ప్రసూనారాణి, జడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీటీసీ అల్లి సుమలత, ఎంపీడీవో కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

ములుగురూరల్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పీ శ్రీజ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్‌తో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం శ్రీజ మాట్లాడుతూ ప్రజావాణిలో 16 దరఖాస్తులు రాగా అందులో 6 రెవెన్యూ, 10 ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయన్నారు. వాటిని ఆయా శాఖలకు సిఫారసు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాదివస్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

సమస్యలు నిర్భయంగా తెలపండి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, జనవరి 29: బాధితులు తమ సమస్యలు నిర్భయంగా తెలియజేయాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివస్ నిర్వహించగా బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ చిత్త శుద్ధితో పనిచేస్తుందన్నారు. సున్నితమైన అంశాలకు సంబంధించిన ఫిర్యాదు విషయంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

ఉప సర్పంచ్ కుటుంబానికి నాగజ్యోతి పరామర్శ

తాడ్వాయి, జనవరి 29 : తాడ్వాయి ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్రారెడ్డి కుటుంబాన్ని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సోమవారం పరామర్శించారు. ఇంద్రారెడ్డి తల్లి మణెమ్మ మృతిచెందగా ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లయ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, చంద్రయ్య, గోపాల్‌రెడ్డి, సారయ్య, కొమురయ్య తదితరులున్నారు.

ప్రత్యామ్నాయ దారులపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్
- దొడ్ల వాగు తాత్కాలిక రోడ్డు, మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన

ఏటూరునాగారం : దొడ్ల వాగు వద్ద తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ తదితరులు

ఏటూరునాగారం/తాడ్వాయి, జనవరి 29 : మేడారం జాతరకు వచ్చే భక్తుల రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ దారులపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక ఫోకస్ పెడుతోంది. ఇందులో భాగంగా ఏటూరునాగారం మండలం దొడ్ల వాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డును కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ పరిశీలించారు. అలాగే మేడారం పరిసరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్, భద్రాచలం నుంచి వచ్చే ప్రైవేట్ వాహనాలను చిన్నబోయినపల్లి, దొడ్ల, కొండాయి మీదుగా ఊరట్టం, మేడారం తరలిస్తుంటారు. గత ఏడాది వచ్చిన భారీ వర్షాలకు దొడ్ల వాగుపై ఉన్న వంతెన కొట్టుకు పోవడంతో వాగుపై తాత్కాలికంగా ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వాహనాలను చిన్నబోయినపల్లి వద్ద మళ్లిస్తామని, ప్రభుత్వ వాహనాలు తాడ్వాయి మీదుగా మేడారం వెళ్తాయని అధికారులు వెల్లడించారు. కొండాయిలోని గోవిందరాజుల ఆలయాన్ని సందర్శించి అక్కడ చేపట్టే ఏర్పాట్లను పరిశీలించారు. గోవిందరాజులు మేడారం వచ్చే దారులు, ఊరేగింపు మార్గాల పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం జాతర పరిసరాల్లో ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి కలెక్టర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. దేవాలయ పెయింటింగ్, లైటింగ్ పనులు, మీడియా భవనం నిర్మా ణ పనులు, పురోగతిని ఈవో రాజేంద్రంను అడిగి తెలుసుకున్నారు. జాతర పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వారి వెంట ఏఎస్పీ సంకీర్త్, ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, డీపీవో వెంకయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్, తహసీల్దార్ రవీందర్, సీఐ రాజు, ఎస్సై కృష్ణ ప్రసాద్, కొండాయి సర్పంచ్ వెంకన్న ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

గుండెపోటుకు గురైన వారి ప్రాణాలను సీపీఆర్ చేసి కాపాడవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మేడారంలోని సమ్మక్క భవన్‌లో సోమవారం డీఎంహెచ్‌వో అప్పయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీపీఆర్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మనుషులు హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయిన సందర్భంలో సీపీఆర్ విధానంతో వారి ప్రాణాలు కా పాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో సీపీఆర్ ఎలా చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూజారులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

జాతర సక్సెస్‌కు సహకరించాలి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అంకిత్

తాడ్వాయి, జనవరి 29 : మేడారం మహా జాతర విజయవంతానికి పూజారులు సహకరించాలని ఐటీడీఏ పీవో అంకిత్ కోరారు. సోమవారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో పూజారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. జాతర సందర్భంగా పూజారులకు చేసిన ఏర్పాట్లను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరగా ఎండోమెంట్ క్యాడర్‌ను సహాయ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా అప్‌గ్రేడ్ చేయడం, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును గద్దెల పైకి తీసుకువచ్చే క్రమంలో రోప్ పార్టీ, డీఎస్పీ స్థాయి అధికారితో భద్రత కల్పించాలన్నారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చే క్రమంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని కోరారు. గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారులకు దేవాదాయశాఖ తరపున శాశ్వత గదులు కేటాయించాలని, ఆలయానికి కేటాయించిన స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు, వసతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కృష్ణయ్య, మునిందర్, వెంకటేశ్వర్లు, గోవర్దన్, భోజారావు, రమేశ్, రాజేశ్వర్, నర్సింగరావు, పూర్ణచందర్, జనార్దన్ పాల్గొన్నారు.

వైద్య రంగంలో సేవలందించడం అదృష్టం

- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జనవరి 29: వైద్య రంగంలో సేవలందించడం అదృష్టంగా భావించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్టాఫ్ నర్సులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సు పోస్టులకు అర్హులైన వారికి పరీక్ష నిర్వహించి రెగ్యులరైజ్ చేసినట్లు చెప్పారు. 87 మందిని స్టాఫ్ నర్సుగా ఎంపిక చేయగా ఇందులో 17 మంది పురుషులు, 70 మంది మహిళలున్నారని తెలిపారు. వారికి 31న సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. వారిని హైదరాబాద్‌కు తరలించడానికి 3 బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ఒక్కో బస్సుకు ఒక సీనియర్ అధికారి, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతుల స్వీకరణ

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ఆర్పీలు, ఉద్యోగులు తమకు రావాల్సిన ఏడు నెలల వేతనాలు ఇప్పించాలని, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో డబుల్ బెడ్రూం ఇండ్లు, భూ, ఇతర సమస్యల పరిష్కారం కోసం 33 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, తిరస్కరించిన వాటిని సంబంధిత దరఖాస్తుదారుడికి తెలియజేయాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాసరావు

ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి తోడ్పడాలి

సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాసరావు

గణపురం, జనవరి 29 : ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి కార్మికులు, అధికారులు తోడ్పడాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని కేటీకే ఓసీ- 3 ప్రాజెక్టులో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై గని అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు, అధికారులు సమష్టిగా పని చేస్తూ కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. కేటీకే ఓసీ- 3ప్రాజెక్టులో ఇంకేమైనా భూ సేకరణ ప్రక్రియ ఉంటే వెంటనే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లగా పైఅధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎస్వీ రావు, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం, గని మేనేజర్ భానుప్రసాద్, బీ శ్యామ్ ప్రసాద్, డీవై పీఎం శ్యాం, సాయి కృష్ణ, పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు

గండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడు మృతి

మహాముత్తారం, జనవరి 29 : మండల కేంద్రానికి చెందిన కాటారం సబ్‌డివిజన్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి బానోత్ జగన్నాయక్ (52) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేశ్, సింగ్‌విండో చైర్మన్ సోమ శాంతకుమార్, కాటారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాదారపు స్వామి, మాజీ జడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మార్క రాము గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

భూపాలపల్లి రూరల్, జనవరి 29 : ఇంటర్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కే వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుండి 15 వరకు ప్రయోగ పరీక్షలు, ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు వార్షిక పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 2,161 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,764 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, మొత్తం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరేశ్‌కుమార్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దేవరాజం, డీపీఆర్వో శ్రీధర్, డీఈవో రాంకుమార్, డీఈవో మధుసూదన్ పాల్గొన్నారు.

సీతక్క తల్లిదండ్రులకు సన్మానం

ములుగురూరల్, జనవరి 29 : మంత్రి సీతక్క తల్లిదండ్రులు సమ్మయ్య-సమ్మక్కను సోమవారం మండలంలోని జగ్గన్నపేటలో అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా డీడబ్ల్యూవో ప్రేమలత హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలపై వివక్ష చూపుతున్న పరిస్థితుల్లో తమ బిడ్డ ఉన్నత స్థానంలో నిలిచేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు, సంస్థ గౌరవ అధ్యక్షుడు మడుగురి నాగేశ్వర్‌రావు, సామాజిక వేత్త ఎండీ ఇక్బాల్‌పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి తల్లిదండ్రులను సన్మానిస్తున్న డీడబ్ల్యూవో తదితరులు



భూపాలపల్లి రూరల్ : కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

మా ఇండ్లు మాకివ్వండి

- 'డబుల్' ఇండ్ల లబ్ధిదారుల వేడుకోలు
- ఇళ్లలోకి వెళ్లేందుకు యత్నం

కృష్ణకాలనీ : డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న లబ్ధిదాలు

కృష్ణకాలనీ, జనవరి 29: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి 11వ వార్డు భాస్కర్ గడ్డలో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలు నిర్మించి తమకు కేటాయించిందని, వాటిని తమకు అప్పగించాలని సోమవారం లబ్ధిదారులు ఇండ్లలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం భాస్కర్‌గడ్డలో 416 డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించిందన్నారు. 2023 నవంబర్‌లో కలెక్టర్ భవేశ్‌మిశ్రా, నాటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో 390 మంది లబ్ధిదారులను గుర్తించి బ్లాక్ నంబర్, క్వార్టర్లు కేటాయించారు. ఎన్నికల కోడ్ రావడంతో ఇండ్ల అప్పగింత నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వ వచ్చినప్పటి నుంచి అధికారులు, ఎమ్మెల్యే సత్యనారాయణను కలిసి ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందే అనేకసార్లు సర్వే చేశారని, మళ్లీ సర్వేలు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు. ఇండ్లలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ కమిటీ పెద్ద మనుషులు ఆందోళన విరమించాలని సూచించారు. తాము కలెక్టర్‌ను కలిశామని కొద్ది రోజుల్లోనే ఇండ్లు అప్పగిస్తామని హామీ ఇచ్చారని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

12న అందజేస్తాం : కలెక్టర్

భూపాలపల్లి రూరల్, జనవరి 29 : డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఫిబ్రవరి 12న అందజేస్తామని కలెక్టర్ భవేశ్ మిశ్రా లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సుమమారు 150 మంది లబ్ధిదారులు ఆందోళన చేపట్టి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇళ్ల మధ్య 11 కేవీ వద్దు

గణపురం, జనవరి 29 : జనావాసాల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్‌ను వేయొద్దని చెల్పూర్ జీపీ పరిధి కుందయ్యపల్లి వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ భవేశ్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. వెంచర్ భూమిలో ఉన్న 11 కేవీ లైన్‌ను తొలిగించి తమ కాలనీ నుంచి వేయాలని సిబ్బంది ప్రయత్నిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యూత్ నాయకుడికి పరామర్శ

కృష్ణకాలనీ, జనవరి 29 : బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు తండ్రి కొమురయ్య ఇటీవల మృతి చెందగా సోమవారం పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గండ్ర గౌతంరెడ్డి ఛక్కీరుగడ్డలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట శ్రీకాంత్ పటేల్, శ్రీరామ్, రఘుపతి ఉన్నారు.



బుర్ర రాజును పరామర్శిస్తున్న గండ్ర గౌతంరెడ్డి

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వెంకటాపూర్/ రేగొండ/ కాటారం, జనవరి 29 : వేర్వేరు కారణాలతో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. రేగొండ మండలం రేపాకకు చెందిన ఇండ్ల కొమురమ్మ (65) అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన జిల్లెల నందిని (17) కడుపునొప్పితో బాధపడుతూ ఈ నెల 24న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తల్లిదండ్రులు సమ్మయ్య-లక్ష్మి తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ చెప్పారు. అలాగే వెంకటాపూర్ మండలం గుంటూరు గ్రామానికి చెందిన కన్నవేన రాజు (25) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రాత్రి ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా రాజు వివరించారు.

పూజారులు వర్సెస్ జాకారం జీపీ

- దుకాణాల ఏర్పాటు కోసం పట్టు
- వేలం పాటను రద్దు చేయించిన పూజారులు
- నేడు సమన్వయ సమావేశం

ములుగురూరల్, జనవరి29 : గట్టమ్మ దేవాలయం వద్ద తాత్కాలిక దుకాణాల ఏర్పాటులో పూజారులు, జాకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. తాత ముత్తాతల నుంచి ఆలయంపై తమకే హక్కులున్నాయని పూజారులు, వేలం పాట దుకాణాలు తమవని పాలకవర్గం పోటీపడుతున్నది. కాగా, సోమవారం జాకారం జీపీ ఆవరణలో దుకాణాల వేలం పాటలను డీఎల్‌పీవో సమక్షంలో నిర్వహించాల్సి ఉండగా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో పూజారులు అదనపు కలెక్టర్ శ్రీజను సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ ఇలవేల్పైన గట్టమ్మ దేవాలయంపై ఆదివాసీ నాయకపోడు కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. జాతర సమయంలో పసుపు, కుంకుమ, కొబ్బరికాయల దుకాణాన్ని ఎలాంటి వేలం లేకుండా తమకు కేటాయించాలన్నారు. మిగతా అన్ని దుకాణాలను వేలం వేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మేడారం పర్యటనలో ఉన్న కలెక్టర్ ఇలా త్రిపాఠిని సురేందర్, పూజారులు కలిసి సమస్యను వివరించి వేలం పాటలను నిలిపివేయాలని కోరారు. దీంతో అధికారులు మంగళవారం కలెక్టరేట్‌లో పూజారులు, జీపీ పాలకవర్గ సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు సురేందర్ వివరించారు.

భూపాలపల్లి రూరల్ : ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, జనవరి 29 : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భూపాలపల్లి, ములుగు కలెక్టరేట్‌ల ముందు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బొడ్డు స్మరణ్, కుమ్మరి రాజు, రవి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి కాస్మోటిక్ చార్జీలు విడుదల కాలేదని, వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదన్నారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొడ్డు కిశోర్, నరేశ్, విష్ణు, స్వామి, అభిరామ్, జీవన్, స్వామి, బాలు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారులకు సన్మానం

సన్మానం పొందిన ఫిజికల్ డైరెక్టర్, విద్యార్థులు

ఏటూరునాగారం, జనవరి 29 : జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్న మండల కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. ఫిజికల్ డైరెక్టర్ రమణతో పాటు క్రీడాకారులు దినేశ్, వివేక్, రాకేశ్, సాయి, రాజు, సాయిబన్, మోహన్, అరవింద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజారాం, శ్రీలత, రాజ్యం, జైపాల్, వీరన్న, మోతీలాల్, మోహన్, నర్సయ్య, సదానందం, రామ్మూర్తి పాల్గొన్నారు.

రక్తహీనత పరీక్షలు

'ఎనీమియా ముక్త్ భారత్'లో భాగంగా సోమవారం స్థానిక గిరిజన గురుకుల క్రీడా పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎత్తు, బరువు, రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు నరహరి, సుజాత, ఫార్మాసిస్టు భాస్కర్, ఏఎన్ఎం రజిని, ప్రిన్సిపాల్ రాజారాం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మహదేవపూర్, జనవరి 29 : స్పెల్ విజర్డ్, డ్రామా పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా, స్పెల్ విజర్డ్ విభాగంలో బాలికల ఉన్నత పాఠశాల (మహదేవపూర్) విద్యార్థిని సీహెచ్ అన్విత మొదటి, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అభిరాం రెండో, కేజీబీవీ విద్యార్థి భార్గవి మూడో స్థానంలో నిలిచారు. అలాగే డ్రామా పోటీల్లో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ రాంచరణ్ విజయం సాధించారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

తాడ్వాయి, జనవరి 29 : అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తుడు గుండెపోటుతో స్పృహతప్పి పడిపోగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ తోట నాగముత్యం సీపీఆర్ చేసి ప్రాణం నిలిపాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు గద్దెల వద్దకు వస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయాడు గమనించిన కానిస్టేబుల్ సీపీఆర్ చేయడంతో పది నిమిషాల తర్వాత స్పృహలోకి వచ్చాడు. ఈ విషయమై డీఎంహెచ్‌వోను అడుగగా అలాంటి కేసులు టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి రాలేదని తెలిపారు.

నూతన జీపీ భవనాల ప్రారంభం

మల్హర్, జనవరి 29 : మండలంలోని తాడిచర్ల, అడ్వాలపల్లిలో నిర్మించిన నూతన జీపీ భవనాలను జడ్పీటీసీ అయిత కోమల, ఎంపీపీ మల్‌హల్‌రావు సోమవారం ప్రారంభించారు. జాతీయ గ్ర